క్లుప్తంగా

జాగ్రత్తలు పాటించాలి

సత్తుపల్లిటౌన్: టపాసుల దుకాణాల వద్ద ఎటువంటి ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు పాటించాలని సత్తుపల్లి మున్సిపల్ కమిషనర్ కొండ్రు నర్సింహ స్పష్టం చేశారు. సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో దుకాణదారులతో పోలీస్, ఫైర్, విద్యుత్ శాఖల అధికారులతో కలసి సమావేశం నిర్వహించారు. ప్రతి దుకాణానికి 10 అడుగుల దూరం ఉండాలని, నీటి డ్రమ్ములు, నో స్మోకింగ్ బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో ఫైర్ ఆఫీసర్ వై.వెంకటేశ్వరరావు, ఏఈ శరత్‌బాబు, ఎస్సై ప్రదీప్, టీపీఎస్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

సీసీఐ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

వైరా: సీసీఐ ద్వారా పత్తి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని సీపీఎం వైరా డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం డిమాండ్ చేశారు. సోమవారం వైరాలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అకాల వర్షాలతో రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. పత్తికి సరైన ధర లేక నష్టానికి అమ్ముకోవాల్సిన వస్తుందన్నారు. సీసీఐ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తామని మంత్రులు మాటలకే పరిమితం అవుతున్నారన్నారు. ప్రభుత్వం స్పందించక పోతే రైతులు రైతు సంఘాలతో కలిసి పోరాటాలకు సిద్ధం కావాలన్నారు.

రైతులను ఆదుకోవాలి



తహసీల్దార్‌కు వినతి అందిస్తున్న బీజేపీ నాయకులు

మధిర: అధిక వర్షాలతో పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతూ.. బీజేపీ మండల అధ్యక్షుడు గడ్డం శ్రీహరి చౌదరి తహసీల్దార్ రాళ్లబండి రాంబాబుకు సోమవారం వినతిపత్రం అందించారు. ప్రభుత్వం వెంటనే గ్రామాల్లో సర్వే నిర్వహించి పరిహారం చెల్లించాలని కోరారు. వినతిపత్రం అందించిన వారిలో బీజేపీ మధిర నియోజకవర్గ కన్వీనర్ ఏలూరి నాగేశ్వరరావు, బెనర్జీ, కృష్ణారావు, విజయ్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

బీసీలకు న్యాయం చేయాలి



మాట్లాడుతున్న బీసీ సంఘం నాయకులు

పెనుబల్లి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బీసీలకు దక్కాల్సిన రిజర్వేషన్లను అమలు పరచి న్యాయం చేయాలని బీసీ సంఘం నాయకులు తెలిపారు. మండలంలోని ముత్యాలబంజర్‌లోని వంగా సీతారామయ్య ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన సంఘ సమావేశంలో వారు మాట్లాడారు. దేశ వ్యాప్తంగా 58.9 శాతం మెజారిటీ ఉన్న బీసీలకు సముచిత స్థానం కల్పించడం లేదని, వాటి లెక్కలు తేల్చకుండా అన్యాయం చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. బీసీలకు శాశ్వత రిజర్వేషన్ ప్రాతిపదికలు అమలు పరచాలని ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో బీసీ ఉపకుల సంఘ ప్రతినిధులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, ప్రజా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

అయ్యప్ప మాలధారణ స్వీకరణ



అయ్యప్ప దీక్ష స్వీకరిస్తున్న భక్తులు

సత్తుపల్లిటౌన్: పట్టణంలోని రాజీవ్‌నగర్ శ్రీవిజయదుర్గా అయ్యప్పస్వామి దేవాలయంలో సోమవారం భక్తులు అయ్యప్ప మాలధారణ దీక్ష స్వీకరించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సీపీఐ నాయకుల నివాళి



మనోహర్‌రావు మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

చింతకాని: మండలంలోని నాగిలిగొండ గ్రామంలో సీపీఐ సీనియర్ నాయకుడు మందా మనోహర్‌రావు(70) అనారోగ్యంతో సోమవారం మృతి చెందాడు. మృతదేహాన్ని సీపీఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు రవీంద్రబాబు, మల్లికార్జున్‌రావు, శ్రీనివాసరావు, మండల కార్యదర్శి గోపాలరావు, నాయకులు తదితరులు సందర్శించి నివాళులర్పించారు.

చి'వరి'కి తెగుళ్ల దాడి



తెగుళ్ల బారిన పడిన వరిపంట

- వరి పంటకు 'దోమపోటు ఎండు తెగులు'
- వాతావరణ మార్పుల కారణంగా..
- అదనంగా మారిన పెట్టుబడి
- ఆందోళనలో అన్నదాతలు

వేంసూరు: ఆరుగాలం కష్టపడి పంటలు సాగు చేస్తున్న రైతులకు ఇబ్బందులు తప్పడంలేదు. యూరియా లభించక అష్టకష్టాలు పడతూ పంటలను కాపాడుకున్న అన్నదాతలకు పంట చేతికొచ్చే సమయానికి తెగుళ్లు దడ పుట్టిస్తున్నాయి. దీంతో రైతులకు పెట్టుబడి అదనపు భారంగా మారుతుంది.

మండలంలోని వివరాలిలా..

వేంసూరు మండలంలో 28వేల ఎకరాల్లో రైతులు వరిపంటను సాగు చేశారు. సన్న రకానికి ప్రభుత్వం బోనస్ ఇస్తుండటంతో దాదాపు 27వేల ఎకరాల్లో సన్నరకం ధాన్యం సాగు చేస్తున్నారు.

అన్నదాతల ఆందోళన..

మండలంలో ముందుగా సాగుచేసిన వరి ఈనగా.. మరికొంత ఈనక దశలో ఉంది. కొన్ని రోజుల్లో పంట చేతికొస్తుందనుకున్న తరుణంలో తెగుళ్ల దాడి చేయడంతో రైతులు అయోమయ స్థితిలో ఉన్నారు. వాతారవణ మార్పులతో ఒక వైపు వర్షం, మరో వైపు ఎండ, ఉక్కపోతతో వరిపై దోమ, ఎండుతెగులు, కంకినల్లి, తెల్లకంకి సమస్యలు ఎక్కువగా ఉండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

పెరగనున్న భారం

తెగుళ్ల ఉధృతితో రైతులకు పెట్టుబడి అదనపు భారంగా మారుతుంది. తెగుళ్ల నివారణకు కొందరు రైతులు ముందుగానే పిచికారి చేస్తున్నారు. పంట చేతికొచ్చేసరికి రెండుసార్లు పిచికారి చేయాల్సి వస్తుంది. ఎకరాకు రూ.3,500 అయ్యే ఖర్చు కాస్తా.. రూ.7వేల వరకు అవుతుందని అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు.

పెట్టుబడి భారం అవుతోంది..



నేను 5 ఎకరాల్లో వరి పంటను సాగు చేశాను. పంట చేతికి వచ్చే సమయంతో పురుగు, తెగుళ్ల ఉధృతి పెరగడంతో పెట్టుబడి ఖర్చు అధికమవుతుంది. ఎకరాకు రూ.4 వేలు అదనంగా ఖర్చు చేయాల్సివస్తుంది. తెగుళ్లతో పంట దిగుబడి తగ్గుతుందేమోనని ఆందోళనగా ఉంది.

– గుంట్రు వెంకట రామారావు, రైతు, కల్లూరుగూడెం

నివారణ చర్యలు చేపట్టాలి..



సుడిదోమ నివారణకు ఏస్పెట్ 1.5 లేదా పైమెట్రోజోన్ 0.6 మందును లీటర్ నీటిలో కలిపి పిచికారి చేయాలి. ఆకు ఎండు తెగులుకు అగ్రిమైసిన్ లేదా ప్లాంటమైసిన్, పోషమైసిన్‌లను వారానికి రెండుసార్లు పిచికారి చేయాలి. గింజమచ్చ తెగులుకు.. ప్రొపికొనజోల్‌ను లీటర్ నిటితో పిచికారి చేయాలి.

– రామ్మోహన్, ఏఓ, వేంసూరు

సస్యరక్షణ చర్యలతో తెగుళ్ల నివారణ



వరి పొలాన్ని పరిశీలిస్తున్న ఏఓ మానస

చింతకాని: పంటలకు ఆశించే చీడపీడలు, తెగుళ్ల నివారణకు సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మండల ఏఓ సోములపల్లి మానస తెలిపారు. సోమవారం మండలంలోని పందిళ్లపల్లి, గాంధీనగర్‌కాలనీ గ్రామాల్లో బ్యాక్టీరియా ఎండు ఆకు తెగులు ఆశించిన వరి పొలాలను ఆమె పరిశీలించి మాట్లాడారు.ఈ తెగులుతో ఆకుల పైన పసుపు రంగు మచ్చలు ఏర్పడి అంచుల వెంబడి అలల మాదిరిగా ఎండిపోవడం జరుగుతుందన్నారు. నివారణకు ప్లాంటమైసిన్ లేదా పోషమైసిన్ 0.2 గ్రాములు లేదా అగ్రిమైసిన్ 0.4 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని సూచించారు. వరి పంటకు ఆఖరి దశగా పోటాష్ ఎరువును ఎకరానికి 15–20 కేజీలు వేయాలని, పొలంలో పాత నీరు తీసి కొత్త నీరు పెట్టాలని సూచించారు. వ్యవసాయ విస్తరణాధికారి కార్తీక్, రైతులు పాల్గొన్నారు.

పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



గర్భిణులకు సీమంతం చేస్తున్న అధికారులు

కొణిజర్ల: పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని తహసీల్దార్ నారపోగు అరుణ, ఐసీడీఎస్ సీడీపీఓ సీహెచ్ కమలప్రియ తెలిపారు. పోషణ మాసోత్సవాల సందర్భంగా సోమవారం మండలంలోని తనికెళ్ల రైతు వేదికలో నిర్వహించిన పోషకాహార ప్రదర్శనలో వారు మాట్లాడారు. అనంతరం గర్భిణులకు, బాలింతలకు అవగాహన కల్పించారు. గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ సీహెచ్ దుర్గా మల్లేశ్వరి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు డి.రాజ్యలక్ష్మి, యస్.అరుణ, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

'ఓటు చోరీ'పై సంతకాల సేకరణ



సంతకాలు సేకరిస్తున్న కాంగ్రెస్ నాయకులు

కల్లూరు: కల్లూరు పట్టణంలోని అంబేద్కర్‌నగర్‌లో కాంగ్రెస్‌పార్టీ ఆధ్వర్యంలో ఓటు చోరీపై సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీ పరిధిలోని 98, 99, 105 పోలింగ్ బూత్‌ల్లో కాంగ్రెస్ నాయకులు సోమవారం సంతకాలను సేకరించి మాట్లాడారు. ఓటు చోరీ చేసి అధికారంలోకి వచ్చిన కేంద్రంలోని బీజేపీ విధానాలను ప్రజలకు తెలుపుతూ ప్రజల అభిప్రాయాలను సంతకాలతో స్వీకరించడం జరుగుతుందన్నారు. కాంగ్రెస్ నాయకులు రాజు, కాంతారావు, శ్రీను, సురేష్, బాబూ రావుల ఆధ్వర్యంలో మూడు పోలింగ్ బూతుల ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

- **తల్లాడ:** మండలంలో సోమవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ చేపట్టారు. తల్లాడ, బిల్లుపాడు, రామచంద్రాపురం, కొత్త వెంకటగిరి, నారాయణపురం, అన్నారుగూడెం గ్రామాల్లో సంతకాలు సేకరించారు. ఈ కార్యక్రమంలో కిషోర్, రామప్పారావు, కృష్ణయ్య, సత్యనారాయణ, వెంకటనరసయ్య, జమాల్, కృష్ణ మూర్తి, వెంకటేశ్వర్లు, నరసింహారావు పాల్గొన్నారు.
- **పెనుబల్లి:** మండలంలోని ఏరుగట్ల, రామచంద్రాపురం గ్రామాల్లో పెనుబల్లి మండల కాంగ్రెస్ నాయకుడు కరీముల్లా ఆధ్వర్యంలో నాయకులు సంతకాలు సేకరణ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, యువకులు పాల్గొన్నారు.

హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన



అవగాహన కల్పిస్తున్న లింక్ వర్కర్లు

కొణిజర్ల: యువత, విద్యార్థులతో పాటు ప్రతిఒక్కరూ హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన కలిగి ఉండాలని వైఆర్‌జీకేఎస్ లింక్ వర్కర్ సూపర్ వైజర్ నందిని, లింక్‌వర్కర్ బి.నాగేంద్ర తెలిపారు. సోమవారం మండలంలోని తుమ్మలపల్లిలో నిర్వహించిన అవగాహన సదస్సులో వారు మాట్లాడారు. ఎయిడ్స్ సోకిన వారు భయపడకుండా చికిత్స చేయించుకోవాలని, ప్రభుత్వం నెలకు 4వేలు పింఛన్ అందిస్తుందన్నారు.

లక్ష్యం ఘనం.. ఆచరణ శూన్యం..





రహదారి వెంట రక్షణ చర్యలు లేకుండా వదిలేసిన మొక్క, మోడుబారిన మొక్క

కల్లూరురూరల్: మండలంలోని పలు గ్రామ పంచాయతీల్లో హరితహారం కార్యక్రమంలో భాగంగా నాటిన మొక్కలు పశువులకు మేతగా ఉపయోగపడుతున్నాయి. రోడ్లకు ఇరువైపులా వేసిన మొక్కలు రక్షణ చర్యలు చేపట్టకపోవడంతో మోడువారి పోతున్నాయి. పర్యావరణాన్ని పరిరక్షించేందుకు గాను భావితరాలకు చక్కటి వాతావరణాన్ని కల్పించాలనే లక్ష్యంతో నాటిన మొక్కలను నిర్లక్ష్యంగా వదిలేయటం వల్ల ప్రభుత్వ లక్ష్యం నీరుగారి పోవటమే కాక నిధులు దుర్వినియోగం అవుతున్నాయి. కల్లూరు మండలంలోని చెన్నూరు, పెద్దకోరుకొండి, చిన్నకోరుకొండి, పాయపూర్, వెన్నవల్లి, ముచ్చవరం, పేరువంచ, లింగాల, తెలగవరం, ఎర్రబోయినపల్లి, మర్లపాడు, ముగ్గు వెంకటాపురం తదితర గ్రామ పంచాయతీల పరిధిలో వేసిన మొక్కలు పశువుల ఆహారానికి బలి అయ్యాయి. 2025–26 సవంత్సరానికి గాను మండలంలో 47వేల మొక్కలు నాటారు. వీటిలో సుమారు 15వేల మొక్కలకు రక్షణ చర్యలు తీసుకోగా మిగిలిన 32వేల మొక్కలు గాలికి వదిలేశారు. మొక్కల రక్షణ విషయంలో కార్యదర్శులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి.

ద్విచక్రవాహనం చోరీ

కారేపల్లి: మండల కేంద్రానికి చెందిన ఓ వ్యక్తి ద్విచక్రవాహనం చోరీకి గురైంది. కారేపల్లి అంబేడ్కర్ సెంటర్‌లోని కనకదుర్గ ఫాస్ట్ ఫుడ్ సెంటర్ యజమాని నూకల శ్రీధర్ తన వాహనాన్ని ఆదివారం రాత్రి సెంటర్ ముందు నిలపగా, ఉదయం దుండగులు ఎత్తుకెళ్లారు. ఘటనపై బాధితుడు కారేపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

న్యాయం చేయండి

వేంసూరు: విద్యుత్ షాక్‌కు గురైన వ్యక్తికి న్యాయం చేయాలంటూ దుద్దెపూడి గ్రామస్తులు మర్లపాడులోని విద్యుత్ శాఖ ఏఈ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. ఈనెల 10న మండలంలోని దుద్దెపూడికి చెందిన ప్రైవేట్ విద్యుత్ ఆపరేటర్ జుంజునూరి వెంకటేశ్వరరావు ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఫీజ్ వేస్తూ విద్యుత్‌షాక్‌కు గురై హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్నాడు. ఆయనకు న్యాయం చేయాలంటూ గ్రామస్తులు ధర్నా నిర్వహించగా.. అధికారులు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

లైబ్రేరియన్‌కు సన్మానం



శేషుప్రసాద్‌ను సన్మానిస్తున్న ప్రిన్సిపాల్ విజయకుమారి, అధ్యాపకులు

కారేపల్లి: కారేపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో లైబ్రేరియన్‌గా విధులు నిర్వహిస్తున్న శేషు ప్రసాద్ తెలంగాణ రాష్ట్ర టీజీఓ కార్యవర్గ కమిటీ సభ్యుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యాడు. దీంతో ఆయనను కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.విజయకుమారి, అధ్యాపక బృందం సోమవారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అధ్యాపకులు కృష్ణవేణి, వనిత, యాకయ్య, పాషా తదితరులు పాల్గొన్నారు.

కిష్టారం విద్యార్థికి..



సంధ్యారాణి, తల్లిదండ్రులను సత్కరిస్తున్న మట్టా దయానంద్, కిష్టారం గ్రామస్తులు

సత్తుపల్లిరూరల్: భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నుంచి ప్రశంసాపత్రం పొందిన శీలం సంధ్యారాణిని కిష్టారం గ్రామ ప్రజలు సోమవారం ఘనంగా సత్కరించారు. గ్రామానికి చెందిన శీలం వెంకటేశ్వరరావు, శివకుమారి దంపతుల కుమార్తె సంధ్యారాణి ఎమ్మెస్సీ బయోటెక్నాలజీ తమిళనాడు రాజధాని చెన్నైలోని సెంట్రల్ యూనివర్సిటీలో పూర్తి చేసి భారత రాష్ట్రపతి చేతులమీదుగా గోల్డ్‌మెడల్ స్వీకరించింది. దీంతో కిష్టారం పాఠశాలలో హెచ్‌ఎం రాంబాబు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు మట్టా దయానంద్ పాల్గొని విద్యార్థిని సత్కరించగా.. గ్రామస్తులు తల్లిదండ్రులను సత్కరించారు. కార్యక్రమంలో అప్పారావు, అప్పారావు, శేషగిరి, రమణ, మల్లికార్జున్, ఈశ్వర్ పాల్గొన్నారు.

ఇది కాలువ కాదు.. రోడ్డే



మాధారం గ్రామంలో రోడ్డుపై నిలిచిన నీటిలో వెళ్తున్న విద్యార్థులు

కారేపల్లి మండలంలోని మాధారం గ్రామంలోని వీధులు చెరువులను తలపిస్తున్నాయి. చిన్నపాటి వానకే.. వీధుల్లో మోకాళ్లలోతులో వరద నీరు నిలిచిపోవడంతో గ్రామస్తులు నడిచే పరిస్థితి లేదు. దీనికి గల కారణం డ్రెయినేజీ వ్యవస్థ సరిగా లేకపోవడమే. సమస్య పరిష్కారానికై పలుమార్లు అధికారులకు తెలిపినా పట్టించుకున్న పాపాన పోలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు రోడ్డుపై నిలిచిన వరద నీరు నిల్వకుండా చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు. – కారేపల్లి

ఫైలేరియా నిర్మూలనకు కృషి చేయాలి



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

చింతకాని: ఫైలేరియా వ్యాధి నిర్మూలనకు కృషి చేయాలని మండల వైద్యాధికారి డాక్టర్ అల్తాఫ్ వైద్యసిబ్బందికి సూచించారు. సోమవారం మండల పరిధిలోని నేరడ గ్రామంలో ఫైలేరియా వ్యాధి నిర్ధారణ పరీక్షలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామాల్లో గుర్తించబడిన ఇళ్లల్లో మాత్రమే ఫైలేరియా వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయనున్నామని, నిర్ధారణ అయిన రోగులకు చికిత్స అందించటం జరుగుతుందన్నారు. ఈ నెల 18వ తేదీ వరకు పాతర్లపాడు, లచ్చగూడెం గ్రామాల్లో వ్యాధి పరీక్షలను నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో డబ్ల్యూహెచ్ఓ టీం సభ్యులు నేత్ర, పల్లె దవాఖానా వైద్యులు సోహెల్, పీహెచ్‌సీ సీహెచ్‌సీ వీరేందర్, హెల్త్ సూపర్‌వైజర్ నాగేశ్వరరావు, ల్యాబ్ టెక్నీషియన్ రామారావు, ఏఎన్‌ఎం పద్మ, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మహిళల చేతిలోనే భవిష్యత్



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న క్రై సంస్థ సభ్యులు

బోనకల్: సృష్టికి మూలమైన మహిళలను గౌరవించాలని, వారిచేతిలోనే భవిష్యత్ ఉంటుందని క్రై స్వచ్ఛంద సంస్థ సభ్యురాలు అరుణకుమారి అన్నారు. అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం మండలంలోని ముష్టికుంట్లలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె పాల్గొని మాట్లాడారు. ఆడపిల్లలను చదివించడం ద్వార సమాజాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. ఆడపిల్లల భద్రత కొరకు క్రై సంస్థ పలు సేవా కార్యక్రమాలను నిర్వహిస్తుందని తెలిపారు. అనంతరం పిల్లలకు చిత్రలేఖన పోటీలను నిర్వహించి బహుమతులు అందించారు. కార్యక్రమంలో క్రై సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

కార్యకర్తల కృషితో పూర్వవైభవం

మధిర: తెలంగాణలో టీడీపీ కార్యకర్తల కృషితో పార్టీకి పూర్వవైభవం వస్తుందని పార్టీ నాయకులు బక్కని నరసింహులు, నన్నూరి నర్సిరెడ్డి తెలిపారు. మధిరలోని పార్టీ కార్యాలయంలో సోమవారం జరిగిన ఖమ్మం పార్లమెంటరీ పార్టీ సమావేశంలో వారు మాట్లాడారు. పార్టీ కార్యకర్తల పట్టుదలతో రాష్ట్రంలో 1.88లక్షల సభ్యత్వాలు నమోదయ్యాయని తెలిపారు. నాయకులు డాక్టర్ వాసిరెడ్డి రామనాథం, మల్లాది హన్మంతరావు, కాపా కృష్ణమోహన్, చేకూరి శేఖర్‌బాబు, వేమూరి సునీల్, యలమంచిలి శివ, దోమందల సామేలు, మార్నీడి పుల్లారావు, తాజుద్దీన్, వంగాల రామకోటి పాల్గొన్నారు.



ఆగని దందా..

అక్రమ మట్టి తోలకాలు జరుపుతున్న ప్రదేశం

యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా, మట్టి తోలకాలు

- ప్రభుత్వ ఖజానాకు గండి
- ప్రేక్షక పాత్ర పోషిస్తున్న అధికారులు
- అలంకారప్రాయంగా బోర్డర్ చెక్‌పోస్టులు



పట్టుబడిన ఇసుక ట్రాక్టర్లు(ఫైల్)

బోనకల్: అక్రమార్కులు ఇసుక, మట్టిని ఆగకుండా అక్రమ రవాణా కొనసాగిస్తున్నారు. ఆంధ్రాలోని లింగాల, పెంట్యాలవారిగూడెం రేవుల ద్వారా ఇసుకను రాత్రివేళల్లో చొప్పకట్లపాలెం, చిరునోముల, గోవిందాపురం(ఎ) గ్రామాల గుండా పలు ప్రాంతాలకు ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్నారు.

అలంకారప్రాయంగా చెక్‌పోస్టులు..

బోనకల్ మండలం ఆంధ్రా ప్రాంతానికి సరిహద్దు కావడంతో కొన్ని రోజుల క్రితం మండలంలోని చొప్పకట్లపాలెం, బోనకల్, గోవిందాపురం(ఎ) గ్రామాల వద్ద చెక్‌పోస్టులను ఏర్పాటు చేశారు. తూతూ మంత్రంగా పోలీసులు తనిఖీలు చేస్తున్న, అక్రమ రవాణా మాత్రం ఆగడం లేదు. బోర్డర్ చెక్‌పోస్టులు సైతం అలంకారప్రాయంగా మారాయి. ఇప్పటికైనా జిల్లా పోలీసు, రెవెన్యూ, మైనింగ్ అధికారులు స్పందించి అక్రమ ఇసుక తోలకాలకు అడ్డుకట్ట వేయాలని ప్రజలు కోరుతున్నారు.

అడ్డు అదుపు లేకుండా మట్టి తోలకాలు..



బోనకల్ బోర్డర్ చెక్‌పోస్టు

బోనకల్ మండలంలోని లక్ష్మీపురం రెవెన్యూ పరిధిలో మట్టి క్వారీలు ఉన్నాయి. గ్రావెల్‌కు డిమాండ్ ఉండటంతో ఇక్కడ నుంచి టిప్పర్లు, ట్రాక్టర్ల ద్వారా తోలకాలు జరుగుతున్నాయి. మైనింగ్, రెవెన్యూ అధికారులకు ముడుపులు చెల్లించి మట్టిని భారీగా తరలిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వానికి డీడీ రూపంలో చెల్లించాల్సిన సొమ్ము పక్కదారి పడుతుండటంతో ప్రభుత్వ ఖజానాకు గండి పడుతుంది. ఈ విషయమై ప్రశ్నించిన వారిని బెదిరింపులకు గురిచేస్తున్నారని సమాచారం. ఇప్పటికైనా అధికారులు స్పందించి అక్రమ మట్టి, ఇసుక తోలకాలను అడ్డుకోవాలని ప్రజలు కోరుతున్నారు.